# కాటేసిన యవ్వనం



మానేపల్లి శివప్రసాదు

కథలు రాయటానికి కాలక్షేపానికి ముసలాళ్ళు పనికొస్తారనేది ఎంతయినా నిజం.

అవి నేను చదువుకొనే రోజులు. రెండు పదులు దాటని నేను అప్పుడే "అవి నేను చదువుకొనే రోజులు" అనాలిసి రావటం నాకు చాలా బాధగా ఉంది అప్పుడే నా చదువు అయిపోయిందా అని. అప్పుడే నా విద్యార్థి జీవితం ముగిసిపోయిందా అని.

బాధ్యతా రహితంగా, ఏ గొడవలూ లేకుండా తల్లి చాటునా, తండ్రి చాటునా దాగి అందంగా చదువుకుంటూ, అందమయినవి చదువుకుంటూ జల్సాగా ఆనందంగా తిరిగే రోజులు! ఒక్క చదువులనే బాధ్యతతప్ప మరేదీలేక కాలం మిగిలిపోయి చదువుతో విసిగి సరదాగా స్నేహితులతో కబుర్లూ కాలక్షేపాలూ చేసిన రోజులు.

పయిలా పచ్చీసుగా గడిపిన రోజులు.

అవో రకం అందమైన రోజులు

తానువలచిందీ రంభ — అనే సామెత లేదూ!

రోజు లెప్పుడూ చెడ్డవి కావు. రోజుల్ని చెడ్డ చేసుకోవటం, మంచి చేసుకోవటం మన చేతుల్లోనే ఉంటూందనిపిస్తుంది నాకు.

తెగించిన వాడికి తెడ్డే లింగం — అందుకే మంచీచెడ్డా అనే రోజులు ఉండవు నాకు.

అది సరేలెండి.

అవి నేను చదువుకొనే రోజులు.

నాది విజయనగరం అయినా విశాఖపట్నంలో చదువుకుంటూ ఉండేవాడ్ని. నాది పొరుగూరవటంవల్ల హాస్టల్సులో ఉండే చదవాల్సి వచ్చింది.

అది వేసవికాలం.

అసలే వేసవికాలం, అందులోనూ టౌన్ వెళ్ళివచ్చానేమో స్నానం చెయ్యాలని బుద్ధి పుట్టింది. స్నానానికి ఉపక్రమించక తప్పింది కాదు.

టాంకులో వాటరు అయిపోవటంవల్ల బాత్‌రూముకి వాటరు రాలేదు. షవరుబాత్ చేద్దాం అనుకున్న నా సరదా చప్పగా చల్లారిపోయింది.

ఎండవేడికి, వొంట్లో తాపానికి వొళ్ళు చమట పట్టేసింది......వానిని మరుగుపరుచుకోటానికి పవుడర్లు అవీ, సెంట్లూ పులుముకున్నాను గాని టవునంతా తిరిగి వచ్చేసరికి వాటి ప్రభావం తగ్గిపోయింది ప్రమిదలో చమురయిపోయినట్టు. యింకా నయం రూముకొచ్చిందాకా నా పరువు నిలబెట్టాయి. నలుగురిలో నా గౌరవం తియ్యకుండా.

అసలే వళ్ళు చిటపట లాడిపోతుంది.

టయిము రాత్రి ఎనిమిది ప్రాంతం అయినా స్నానం చేస్తేనేగాని ప్రశాంతమయిన నిద్దర పట్టదని యిక స్నానం చెయ్యక తప్పదని టవలూ, సబ్బూ పట్టుకుని నూతిదగ్గరకు వెళ్ళాను.

మేం వాడేది నూతి నీరేలెండి. టాంకుకి కూడా నూతినీరే. మోటారుతో టాంకులోకి నీరు పడతారు.

అదేం మహత్యమో మరి అది విశాఖపట్నమూ అందులోనే సముద్రం— దగ్గరగా ఊళ్ళోనే ఉందా— అయినా నూతిలో నీరు మట్టుకు

తియ్యగానే వుంది. అదంతా భూదేవి తల్లి మహాత్యం అనుకుంటాను.

మా వాటరుమన్ పేరు హుస్సేను. నేను నూతి దగ్గరకు వెళ్ళేసరికి హుస్సేను నీళ్ళు పంపు చెయ్యడానికి గొట్టంలో నీళ్ళు పోస్తున్నాడు. చెప్పాను కదూ. యిది వేసవి కాలమని. అందుకు నూతిలో నీళ్ళు అడుక్కి పోవటంవల్ల పంపుగొట్టంలో ముందు కొంచెం నీళ్ళు పోస్తేనేగాని మోటరు పనిచెయ్యదు.

అపనే చేస్తున్నాడు హుస్సేను.

అయితే టాంకుకి నీరు పెడుతున్నాడేమో యిక నూతి దగ్గర నీళ్ళు తోడుకుని స్నానం చేసేపని వుండదనుకున్నాను

"ఏం హుస్సేనూ టాంకుకి వాటరు పెడుతున్నావా?" అంటూ పలకరించాను.

"మెస్సు కెళతరండి. అక్కడ వాటరులేదు. వెధవది యిరవై బాల్చీలు తోడిపోశాను గాని యింకా నిండలేదు వెధవగొట్టం గొట్టంలో నీరులేదు. ఒక్కొక్కప్పుడు నిండావుంటుంది. ఒక్కొక్కప్పుడు ఎంతపోసినా నిండదు" అంటూ తన పనిలోని విసుగునంతా నా మీద వెళ్ళగక్కాడు నా ప్రశ్నకి జవాబుగా.

కాని అంతల్లోనే శాంతించాడు. తన సాధక బాధకాలు వింటానుకదా అనే సానుభూతి చూపుతూ అన్నాడు యిలా—

"ఈ బాధలన్ని వాళ్ళకు తెలియవండీ. కాని నేను మెస్సుకెళ్ళేసరికి వాటర్ పెట్టావ్ కావని పీక్కుతింటారు. ఈ లోపల వాటరంతా కుర్రాళ్లు స్నానాలు చేసేస్తారు. అక్కడకు వెళ్ళకుండా." అన్నాడు.

నాకు నిజంగా అతనిమీద కొంచెం జాలి వేసింది.


దూరాన్నుంచి జోడీగంటలు ఎనిమిదికొట్టింది.

—టంగ్ టంగ్... — టంగ్‌టంగ్ మని రెండేసి కలిపి అంటే టయిము నాలుగయితే టంగ్‌టంగ్ మని రెండుసార్లు. ఎనిమిదయితే నాలుగుసార్లు కొడతారు. ఏడయితే మూడుసార్లు జోడీగంటలు కొట్టి ఒకటే గంట టంగ్‌మని ఒకటి కొడతారు. అందుకే అవి జోడీగంటలు.

బ్రతుకు తెరువుకోసం దూరంలో పెళ్ళాం పిల్లల్ని వదిలి వచ్చాడు అతను. నెలనెలా పంపిస్తుంటాడు. లేపోతే విద్యార్థులకి సెలవలు-అంటే పెద్దపెద్ద శెలవులు వేసవి శెలవులో. సంక్రాంతి శెలవులో—వచ్చి యింటికి వెళ్ళిపోయి హాస్టలు మూసేస్తే అప్పుడు ఆ సెలవుల్లో యింటికి ఒకసారివెళ్ళి అందరినీ తనివితీరా ఓ ఆరునెలలదాకా సరిపడా భ్రాంతితీరా చూసి తిరిగి వచ్చేస్తాడు.

అతను మా హాస్టలకి వాటర్‌మాన్. నైట్ వాచర్ కూడా అతనే.

అతనంటే నాకొంచెం అభిమానమనే చెప్పాలి అతను జాలి దయ కరుణగల మనిషి. కుర్రాళ్ళంటే ప్రేమ చూపిస్తాడు. సినిమాలుచూసి పదకొండుగంటల రాత్రి అప్పుడు వచ్చినా లేదన




కండా మెస్సు తాళాలుతీసి భోజనం పెడతాడు— సర్వర్స్ అందరూ పడుకుంటే

హాస్టలు పుట్టిన దగ్గరమంచీ దాన్ని కనిపెట్టుకుని ఉన్నాడు. అతని వయసూ, కుటుంబమూ, ధరలూ పెరుగుతూ వచ్చాయికాని అతని జీతం మట్టుకు పెరగలేదు. అది ఈ కాలంలో ఉన్న ఆనవాయితీయే గనుక.

వయసు మళ్ళినవాడు నాలుగు కాలాలూ, నాలుగు ప్రదేశాలూ నలుగురి మనుషుల మనస్తత్వాలూ తెలిసినవాడు

కష్టసుఖాల ఆటుపోటులు అనుభవించినవాడు అతని పేరునుబట్టీ తెలుస్తుంది. అతడు తెలుగువాడు కాదని. అయినా ఈ తెలుగు దేశంలోనే జీవనంగడపటంవల్ల తెలుగు మాతృభాషలా అయిపోయి అసలు మాతృభాష ఆకాశంలోకి ఎగిరిపోయింది. అలా అది మరీఅంత రాదనుకండి ఎలాగయినా అక్కడి పుట్టిన వాడుకదూ.

అప్పుడప్పుడూ యిలాగే మాట్లాడుకుంటుంటాం కష్టసుఖాలు- మేం యిద్దరమూ ఏవేవో కబురూ, కథలూ చెబుతుంటాడు.

అవాళ పండిగేమో క్లాసుల్లేవు. ఏ పనీ లేదు. ఉగాదిపండగ అయినా ఒకరోజు సెలవుకి అంతదూరం వెళ్ళిరావటం ప్రయాసఅని యింటికికూడా వెళ్ళలేదు.

ఏవో కబుర్లాడుతూ స్నానం చేసేస్తున్నాను. అంతటికీ ఈ కబుర్లలో రాత్రి ఏదో గొడవ నాకు జ్ఞాపకం వచ్చింది రాత్రి నిద్రమత్తులోనో మరెందువల్లో ఆ గొడవని అంతగా పట్టించుకోలేదు. దాన్ని పట్టించుకోవాల్సిన అవసరం కూడా నాకు కనిపించలేదు.

వెధవ నిద్రని ఎంతయిచ్చాడో దేవుడు మనిషికి. జీవితాన సగభాగం నిద్రకే సరిపోవు—అని మూల్గుతుంది నామనస్సు ఒకొక్కప్పుడు మానవుడు. బతికేది సగం చీకటిలోనే. సగం నిద్రలోనే— గడిపేస్తాడు. మిగిలిన సగంలో బాలుడుగా— బేలగా పదిసంవత్సరాలు గడిపేస్తాడు. తరవాత జల్సాలూ, సరదాలూ అంటూ అటూ ఇటూ చూస్తాడు యౌవనంలో ప్రవేశిస్తాడు. అమ్మాయిల వెంట పడతాడు - అబ్బాయిలవెంట అమ్మాయిలు పడరు గనుక వాళ్ళ ఊసు ఎత్తలేదు అబ్బాయిలే అమ్మాయిలవెంట పడతారు. పడేటట్టు అమ్మాయిలే చేసుకుంటారనుకోండి—

రజస్తమో గుణాలతోనే జీవితం వెళ్ళబుచ్చుతాడు మానవుడు సత్వగుణం ఉందనే తెలియదు.

యివన్నీ నా బుర్రలో ఒక్కొక్కసారి యిలాగే ఆలోచనలు రేగి— ఛీ యిక పడుకోకూడదు పడుకున్నా చాలా తక్కువ పడుకోవాలి జీవితంలో మూడొంతులు విజ్ఞానంకై వినియోగించాలనుకుంటూ రాత్రి ఒంటిగంటా రెండుదాకా పడకమానేసి నిద్ర మానేసి ఏదో రాస్తూ కూర్చుంటా-

కాని వెధవది మనసులో ఉన్నంత మాత్రాన చెయ్యగలమా చదువంటే నేర్చుతారుగాని యింద్రియ నిగ్రహం ఎలావస్తుంది తెల్లవారేసరికి తాగినాడి కళ్ళలా ఎర్రగా అయిపోయేవి నాకళ్ళు. ఒక్కొక్కప్పుడు రాత్రి ఒకగంట నిద్ర మానేస్తే తెల్లారి ఎనిమిది గంటలదాకా నిద్ర పట్టేసేది ఒకొక్కప్పుడు క్లాసుకి వెళ్ళటం కూడా లేటయిపోయేది

రాత్రి నిద్రలేకపోయినా పండగ గొడవల్లో ఫ్రెండ్స్ పడుకోనివ్వరూ ఆ నిద్ర తలచుకొనేసరికి రాత్రి గొడవ జ్ఞాపకం వచ్చింది నాకు.

"ఆఁ ఏమిటి హుస్సేనూ రాత్రి దెయ్యం పడిందట హాస్టలులోనా!" అన్నాను.

నాకు - దెయ్యమంటే నమ్మకముందా అంటే చెప్పలేనుగాని దెయ్యాలని పూర్తిగా కాదనలేను. అందరూ దెయ్యం పడింది నాకు దెయ్యం కనిపించింది — అల్లావిడిని దెయ్యం పట్టుకుంది —

# కాటేసిన యవ్వనం

మొన్నేమో నేనూ సైకిలుమీద వెళుతుంటేనూ, రాత్రి పది అవుతుందిలే రోడ్డు నిర్మానుష్యంగా ఉంది నేను పాట పాడుకుంటూ వెళుతుంటే దారిలో అడ్డుగా నిలబడింది. నాకు భయంవేసి గబగబా ఆపకండా తప్పించుకుంటూ వచ్చేశాను. — అని చెబుతుంటే వినటమే. తప్పించి నేనెప్పుడూ దెయ్యాన్ని చూడనేలేదూ. నన్నెప్పుడూ దెయ్యం పట్టుకోనూ లేదు.

దెయ్యం తెల్ల ముసుగు వేసుకుంటుందనీ జుట్టు విరబోసు కుంటుందనీ దెయ్యం పాదాలు వెనక్కి తిరిగి వుంటాయనీ వర్ణిస్తుంటారు, దెయ్యాలవారు.

మొన్న నా స్నేహితుడు ఒకడు "ఒరేయి మొన్న నెలవుళకి యింటికి వెళ్ళటం మానేసినా బావుండేదిరా. మా అత్తమ్మకి దెయ్యం పట్టింది. మా అమ్మేమో అవతలుంది. యిక వంట నేనే చేయాల్సివచ్చింది." అనేసరికి నాకు నిజంగా వాడిమీద జాలివేసింది. పాపం పూర్ ఫెలో అనుకున్నాను. నేను నేనే పూర్ ఫెలోనిరా దెయ్యం నాకు పట్టలేదు సరికదా, దెయ్యం పట్టినవాళ్ళని కూడా చూడలేదు అనుకున్నాను.

అలా తను వేసవికాలం కదానిలోపల పడు కుంటే ఉక్కపోస్తుందని గాలికోసం యివతల వరండాలో వేసుకున్నాడట. అతనొక్కడే పడుకున్నాడట. మరెవరూ తోడులేరు. అందులోకీ దానికితోడు ఎవరో, అతడు పడుకున్నచోట లైటు ఆర్పేశారట సరదాకి. ఒక్కడే పడుకున్నాడేమో దెయ్యం పట్టుకుని కొంతదాకా మాట్లాడనివ్వలేదట. తరవాత లోపలికివెళ్ళి పడుకుంటే పోయిందట" అన్నాడు హుసేను.

యిలాంటివి వింటూంటే నాకు మరీ ఆశ్చర్యం వేస్తుంటుంది. దెయ్యాలు నోరు నొక్కేస్తుంటాయట, మాట రానివ్వవట. కదలనివ్వవట. అరుద్దామని నోరు తెరిస్తే శబ్దమే రానివ్వదట. ఒక్కొక్కప్పుడు రాత్రి పడుకుని లేచేసరికి వొంటిమీద ఏదో బక్కుర్లు కనిపిస్తాయి అవి ఎలా వచ్చాయంటే 'రాత్రి దెయ్యం గోళ్ళతో గీసేసింది అవి దెయ్యం బక్కుర్లు' అంటుంటారు మనవాళ్ళు.

యివన్నీ ఆలోచిస్తూంటే నాక్కూడా విషయం రూఢి అవుతుంది. దెయ్యాలు అందరినీ పట్టవనీ, ఒక్కొక్క వ్యక్తి మనస్తత్వాన్ని బట్టి అతని పరిసర ప్రాంతాలబట్టి వంశ పారంపర్యాన్ని బట్టి అతని అలవాట్లను బట్టి అతనిలో ఏర్పడిన ఒక రకమైన హృదయ బలహీనతవల్ల అతన్ని దెయ్యం పడుతుందనిపిస్తుంది.

"అయితే యిక్కడా దెయ్యాలున్నాయన్న మాట' అన్నాను యాదాలాపంగా బక్కెటులో నీళ్ళు తోడి పోసుకుంటూ.

"ఇక్కడ ఉన్నది అదొక్కటే దెయ్యం బాబూ అదయినా ఎవరినీ ఏమీ చెయ్యదు. కాని ఆ దెయ్యం వెనకాల పెద్ద కథ వుందండి" అన్నాడు హుస్సేను గొట్టంనిండా నీళ్ళు నిండినట్లున్నాయి మోటారు ఆన్ చేస్తూ.

నాకు — ఆ దెయ్యం వెనకాల కథ వుందనేసరికి — కొంచెం వుత్సాహం కలిగింది. దెయ్యం కథలన్నా, కలల కథలన్నా వినడానికి నాకు అమిత కుతూహలం కలుగుతుంది. అయినా యీ దెయ్యం కథలన్నీ ఏదో విషాదాంతాలయి తీరతాయి. ఎలాంటి విషాదాంతం వినాలో అనిపించినా ఆ దెయ్యం గురించి వినాలనిపించింది.

"కథంటే కథేనా? లేక నిజమేనా?" అన్నాను సందేహంగా.

"నిజమే బాబూ" అన్నాడు.

ఆ కథని విందాం అనే హడావిడిలో వళ్ళుతో వొళ్ళు తోముకున్నానో లేదోకూడా జ్ఞాపకంలేదు. గబగబా రెండు బాల్చీలు నీళ్ళు వొంటిమీద దిమ్మరించుకుని పైకి వచ్చేశాను.

"ఉండండి బాబూ బాత్‌రూము వాల్వు కట్టేసి వస్తాను. లేకపోతే వాటరు మెస్సుకి వెళ్ళదు. బాత్‌రూము టాంకుకి వెళ్ళి పోతుంది అని వెళ్ళాడు హుస్సేను.

ఓ నిమిషంలో తిరిగి వచ్చాడు.

మానవ కల్పిత యంత్రం దానంతట అదే నీరు తోడుకుంటూ పోతుంది. యిక్కడంటే మోటారు దురు దురు శబ్దం చేస్తుందని యిద్దరం కొంచెం దూరం నడిచి రాళ్ళమీద కూర్చున్నాం.

అప్పుడే స్నానం చేసి వచ్చానేమో వొంటికి తగులుతున్నగాలి చల్లగా తగులుతుంది.

"ఆఁ యినండి బాబూ" అంటూ చెప్పడం మొదలుపెట్టాడు హుస్సేను.

అతనివైపే చూస్తూ కూర్చున్నాను.

\+ + +

హాస్టలు కొత్తగా కట్టిన రోజులు.

రోజురోజుకీ పెరిగిపోతున్న పట్టణానికి కొద్ది దూరంగా ప్రశాంతంగా వుంటుందనీ కావలసినంత విశాలమయిన చోటు దొరుకుతుందనీ — కాలేజీ కట్టారు. దాని వెనకాతలే హాస్టలు — వీటన్నిటి వెనకాలా తూర్పు కనుములు.

అత్యంత రమ్యమైన ప్రకృతి సౌందర్యం. ప్రశాంతమయిన ప్రకృతి.

హాస్టలు బిల్డింగులు. రెండు అంతస్తులుగల రెండు బిల్డింగులు. వాటి వెనకాల భోజనాలకి మెస్సు రూములు రెండిటికీ రెండు విడివిడిగా ఉన్నాయి. వీటన్నిటికీ వాటరు సప్లయి కోసమని ఈ బిలింగులకి పడమరగా పెద్ద నుయ్యి తవ్వించి మోటారుసెట్టు పెట్టించారు.

తూర్పుగా ఓ చిన్న వాగులాంటిది వుంది. అందులో నీరు ఎప్పుడూ వుంటుంది. వర్షాకాలంలో అయితే పెద్ద కాలవలా ప్రవాహం వుంటుంది. దానికి అవతల వొడ్డున కొండపాదం. సమ ప్రదేశం.

బిక్కా కాందిశీకులు నీడకోసమని చిన్న చిన్న పెంకుటిళ్ళు, పూరి పాకలూ వేసుకున్నారు,


## మీకు ఆనందాన్నిచ్చే పుస్తకాలు

1. "తెలుసుకోతగ్గవి" : ఈ పుస్తకము సకల విజ్ఞాన కల్పతరువు. మీ జీవిత సంతోషాలకు మీరు తెలుసుకోదగ్గ అనేక వందల అద్భుత విషయాలు కలవు: వెల. రు. 5-లు
2. అద్భుత హాస్య కథలు : ఈ పుస్తకంలో బ్రహ్మాండముగా నవ్వు పుట్టించే చిన్న కథలు కొన్ని వందలున్నాయి. నవ్వి, నవ్వించటానికి ఉపయోగం. వెల రు. 3-50
3. చేతిపనులు : చిన్న పరిశ్రమలకు, సర్దాకి, సంపాదనకు మీ కిష్టమైన ఎన్నోరకాల వస్తువులు సులభంగా ఇంట్లో తయారుచేసుకొనే విధానాలు ఇందుగలవు. వెల రు. 3-50
4. మంత్రశక్తి : మీ కోర్కెలు నెరవేర్చుకోవటానికి వివిధ మంత్రాలు, వాటి అద్భుత రహస్యాలు. సాధన మార్గాలు ఈ పుస్తకములో పేర్కొనబడినవి వెల రు. 3-50
5. జీవిత రహస్యాలు : మీ దాంపత్య జీవితాన్ని సంపూర్ణ ఆనందమయం చేసుకొనడానికి అనేక దివ్య కామసూత్రాలు ఇందుకలవు. వెల రు. 3-50
6. యువతి : స్త్రీలను గురించి యువతీ, యువకులు తెలుసుకోదగిన అనేక అద్భుత కుతూహల విషయాలు గలవు. వెల రు. 3-50
7. సంతానము : కామ సుఖాలు అనుభవించుచుకూడ అవసరం లేనపుడు గర్భం రాకుండా అవలంబింపదగు 60 సులభ మార్గాలు పేర్కొనబడినవి వెల రు. 3-50

పై ఏడు పుస్తకముల రచయిత : ఎ. ఎన్. మూర్తి యం. ఎ. పోస్టు ఖర్చులుచితం.

దేశసేవ ప్రచురణలు, అశోక్ నగర్, ఏలూరు—2 (ఆంధ్ర) కు వ్రాస్తే. మీకు కావలసిన పుస్తకాలు వి. పి. పోస్టుద్వారా పంపబడును,

అదంతా కలిసి ఓ కాలనీలా వుంటుంది. మన విద్యార్థి బృందం అంతా దానిని "బర్మా కోలనీ" అనే అంటారు.

ఆ చుట్టుప్రక్కల ప్రదేశాలలో బట్టలు వుతకటం, కొండరాళ్ళు దొలిచి యిళ్ళు కట్టడానికీ, రోడ్డుకు పనికివచ్చే రాళ్ళు కొట్టడం మొదలయిన కూలిపనుయి చేస్తూ జీవనోపాధి గడుపుతుంటారు.

ఆ కాలనీ అంతటికీ ఓ నుయ్యి వుంది. అందులో నీరు తాగటానికి వాడుకుంటారు. కాని అది యిలాటి వేసవికాలంలో ఆ నూతిలో నీరు ఎండిపోతుంది. వాగులోని నీరు వాడుకోవచ్చు గాని అది విపరీతమైన ఎండలకి బలహీనమయి పోవటంవల్లా, అందులోనే బట్టలు వుతుకుతుండటంవల్లా ఆ నీరు తాగేవారుకాదు.

అప్పుడు మన హాస్టలు నుయ్యి అండగా కనిపించింది వాళ్ళకి ఈ నుయ్యిలో ఎప్పుడూ పుష్కలంగా నీరు వుండేది. వాళ్ళకి కొంచెం దూరమే అయినా హాస్టలు నూతి నుండీ మంచి నీళ్ళు పట్టుకెళ్ళేవారు

నూతికి రావాలంటే హాస్టలు రూము వక్కనుంచే రావాలి.

అదే కొసా రూము. దానిపక్కనుంచే రావాలి నూతికి. అందరూ ఆ తోవంటే నీళ్ళు తీసుకు వెళ్ళేవారు. అదే అన్నిటికంటే దగ్గర తోవ.

యిలాంటి వేసవిరోజులే అవీను.

ఆ రోజుల్లో ఒక రోజు.

అవాళ అందరు కుర్రాళ్ళు కాలేజీకి వెళ్ళిపోయారు. ఎవ్వరూ లేరు. పదకొండుగంటల ప్రాంతం. ఆ కొసారూములో అతనొక్కడే ఉన్నాడు.

ఆ రూము వక్కనుంచే రావాలి నూతికి.

ఏదో చదువుకొనో, పని చేసుకొనో కొంచెం విశ్రాంతి కోసం కిటికీ దగ్గరకు వచ్చి నిలబడ్డాడు.

అప్పుడే ఓ బర్మా యువతి నీళ్ళ కోసం వస్తుంది.

ఆమె ఆ కాలనిలో అందరికన్నా అందమయినదని చెప్పవచ్చు. పన్నగా, చక్కగా ఉంటుంది.

అతను యింతకుముందు చాలా సార్లు చూశాడు ఆమెను. ఆమె యౌవనం. ఆమె అందం కొంచెం అతన్ని చంచలం చేసిందికూడా.

వాళ్ళు సామాన్యంగా కుర్రాళ్ళు లేని సమయం, కాలేజీ టయిముల్లో వస్తుంటారు నీళ్ళ కోసం ఒటు జట్లుగా.

కాని యివాళ ఆమె ఒక్కతే వస్తుంది. ఎందుకు పుట్టిందో అవాళ అతనిలో ఆ కోరిక.

రూము పక్కనుంచే వస్తుంది ఆమె.

భౌతికంగా గాని, మానసికంగా గాని విశిష్టత కలిగి వుండటంలో ఒక విధమైన నిధి దోషం వుంది. తోటి వాళ్ళకి భిన్నంగా ఉండకుండా వుండటమే మంచిది. ఒక విధంగా శరీర సౌందర్యం కాని బుద్ధిసూక్ష్మతగాని లేవి వారి జీవితాలు మంచివే. ఏ ప్రత్యేకతా లేకపోవటం వల్ల వాళ్ళు ఎవరినీ ఆకర్షించలేరు. కాని.....

ఆమె అందాల రాశి. యౌవనం ఉరకలు వేస్తుంది. శరీరం వొంపులు తిరిగింది—వికసించిన పుష్పం. మకరందం నిండా ఉన్న సుకుమార కుసుమం.

దోరజామ పండునే చిలకలు కొట్టేది.

రంగు రంగులుగా ఆకర్షణీయంగా వున్న పుష్పాల్లోని మకరందాన్నె తుమ్మెద ఆస్వాదించేది.

అందం కూడా ప్రతిభ స్వరూపాల్లో ఒకటి. ప్రతిభకంటె ఎక్కువయినది. అదో ప్రత్యేక మయిన విశిష్టత—అందానికి వివరం కాని వ్యాఖ్యానం కాని అవసరంలేదు. అది ప్రత్యక్ష దృశ్య సాక్ష్యం సూర్యకాంతిలా వసంతంలాగ విశ్వసత్యాలలో అందం ఒకటి.

అందుకే ఆమెను అతను ప్రేమిస్తున్నాననుకొన్నాడు.

జీవితంలో మరేపనిలేని వారికి ప్రేమించడం ఒక గొప్పపని ఒక దేశంలోని పనిపాటలు లేని వర్గాలవల్ల కలిగే ప్రయోజనం అదొక్కటే.

మనల్ని మనం మోసం చేసుకోవటంతోనే మన ప్రేమ ప్రారంభం అవుతుంది. ఇతర్లని మోసం చెయ్యటంతో అంతమవుతుందా. దీన్నే ప్రపంచం "ప్రణయం" అని పేరుతో పిలుస్తుంది.


అందుకే అతను ఆమెతో ప్రణయం సాగిద్దాం అనుకున్నాడు. ఆమె మీదకి అతని మనస్సు పోయింది. అతనికి సమయం అంతా అనువుగా కనిపించింది.

ఏకాంతవాసం మనిషిని ఎంతయినా పాడు చేస్తుంది. అతని చేతలు ఎలాంటి అమానుషమయినా చేయిస్తుంది. దుష్పరిణామాలకు దారి తీస్తుంది.

అవును తన కోర్కె తీర్చుకొంటే తప్పేమిటి? యిలాంటిసమయం ఎప్పుడువస్తుంది? దేవుడే కల్పించి వుంటాడు. యిలాంటి అందమయిన క్షణం. అనువైన సమయం—తన కోరిక తెలుసుకుని—అవి తనని తనే మభ్యపెట్టుకున్నాడు. తాను చేయబోయే కర్మని తానే సమర్థించుకున్నాడు

ఆత్మను ఇంద్రియాలు తప్ప మరేవీ శుద్ధి చేయలేవు. ఇంద్రియాలను ఆత్మతప్ప మరేవీ శుద్ధి చెయ్యాదు. ఆత్మద్వారా యింద్రియ దుగ్మత పోతుంది. ఇంద్రియాల ద్వారానే ఆత్మదుగ్మత పోతుంది.—అనుకున్నాడు.

ఒక చెడు ఆకర్షణనుంచి తప్పించుకోడానికి ఒకటె పద్ధతిఉంది అది—దానికి లొంగిపోవటమే. దాన్ని నిరోధించావా అదే పిన్ను లొంగదీసుకుంటుంది. నీహృదయం అది నీకుదూరంగా ఉంచిన విషయాలకోసం తాపత్రయ పడుతుంది—



వినాయకుడి ఊరేగింపు

యు. ఆశీర్వాదం, అమలాపురం

(58 వ పేజీ చూడండి)

## కాటేసిన యవ్వనం

( 39 వ పేజీ తరువాయి )

అన్న ఆస్కార్ వైల్డు సిద్ధాంతం జ్ఞాపకం వచ్చింది.

స్పృశించి అనుభవించదగిన అందమైన వస్తువులనే నేను ప్రేమిస్తాను అనుకొన్నాడు అతను.

అందుకే అతని మనసు అలా ప్రేరేపించబడింది. ఆమె నూతినుంచి నీళ్ళు బిందుగా తీసుకుని భుజాన పెట్టుకుని వస్తుంది.

"దాహంగా ఉంది, కొంచెం మంచినీళ్ళు యివ్వవూ "అని అడిగాడు ఆ అమ్మాయిని అతను.

ఉపకారంకోసం— అతని దాహం తీరటానికి బిందెదించింది. పాపం ఆమెకి తెలియదు దాహం వేసేది అతనికి కాదనీ అతని దేహానికనీనూ.

అంతే గబుక్కున చెయ్యి పట్టుకున్నాడు,
రూములోకి లాక్కుని వచ్చేశాడు.
ఎంతో పెనుగులాడింది ఆమె.

అరుద్దామంటే పలుకు రాలేదు. హఠాత్ సంఘటనకి మాట రాలేదు. పాపం— అబలకి.

ఆత్మ శరీరం: శరీరం ఆత్మ — ఈ రెండు ఎంత విచిత్రమైనవీ. ఎంత అనూహ్యమైనవీ. ఒక్కొక్కసారి ఆత్మలో పశుత్వం మేలుకుంటుంది. ఒక్కొక్కసారి శరీరం అంతా మలిన స్థితి పొందుతుంది. ఇంద్రియాలు సంస్కృతాలై కేవలంగా నిర్మలత కోరదు. ఆత్మ అధఃపతనం అయినప్పుడు యింద్రియానుభూతి ఎక్కడ మొదలవుతుందో ఎక్కడ అఖరవుతుందో ఎవరు చెప్పగలరు?

నిర్మల హృదయం స్వచ్ఛమైన ప్రేమను కోరుతుంది కాని క్షణభంగురమైన యౌవనాన్ని తుచ్ఛమైన లాలసను వాంఛించదు. కాని యువకుని హృదయం యువతీ గాఢాలింగనాన్ని కోరటం సహజం. అది ప్రకృతి సిద్ధమైన విషయం. ప్రకృతికి విరుద్ధంగా ఎవ్వరూ నడవలేరు.

మానవత్వం నశించిన మానవుడు భూత భవిష్యత్ వర్తమానాన్ని ఆలోచించలేడు.

అదే జరిగింది అతనిలో ఆనాడు.

పశువాంఛ ప్రబలిపోయింది.

అతని కామవేదన తన క్షుద్రమైన అగ్ని జ్వాలల తాలూకు ముద్రలు ఆమె పెదవులమీద, శరీరం మీద, ప్రతి అంగం మీద, ప్రతి అణువు మీద, ప్రతి అంగుళం ప్రదేశం మిదా విడుస్తుంది. ఆమె అతని బాహు బంధాల్లో నలిగిపోయింది. అతని క్షణికోద్రేకానికి బలి అయిపోయింది. అతనిలో ప్రబలిన పశువాంఛకు ఆమె నిండు మానం, నిండు జీవితం ఆహుతి అయిపోయింది.

లేచి కోడిపుంజులా ఓసారి వళ్లు దులుపుకున్నాడు.

ఆమె వణికిపోతుంది. నలిగిపోయిన చీర. నలిగిపోయిన శరీరం.

అతని దాహం కోసం బిందె దించింది.

యింకేం చెయ్యగలదు. గడిచిన క్షణాన్ని వెనక్కు లాగగలదా? పాలలో పడిన విషాన్ని పైకి తీసేయగలదా!

అతను— చేసింది చాలక ఎవరికన్నా చెప్పావో చావు కళ్ళ చూస్తావు అని బెదిరించాడు.

జరిగినదాన్ని తుడిచివేయలేక జరగకుండా నిరోధించలేక నిస్సహాయతతో, నలిగి పోయిన చీరనీ చెరిగిన జుట్టునీ సరిచేసుకుని గది బయటికి నడిచింది

తనలో ప్రవేశించిన సత్యాన్ని దాచడానికి, తాత్కాలికంగా వొంటికి అంటుకున్న మలినాన్ని క్షాళితం జేసుకోడానికి, యింటికి యిలా వెళితే, ఈ వేషం, ఈ అవతారం చూసి ఏమనుకుంటారు? తన రహస్యం తెలిసిపోదూ! అనుకుని గబగబా నూతిదగ్గరకువెళ్ళి తలారా స్నానం చేసేసింది. తడిచీరతో మడిగా బిందె నిండా స్వచ్ఛమైన, నిర్మలమైన, నీళ్ళుతీసుకుని యింటికి దారి బట్టింది.

రోజులు నడుస్తున్నాయి.

కాలం గడుస్తుంది.

కాలానికి మానవుడంటే చాలా అసూయ. అతని అందాన్ని, సుఖాన్ని శాంతినీ చూడలేదు.

ఆమె ఆ రహస్యాన్ని, ఆ బాధని, ఆ వేదనని అలాగే బయటకి వ్యక్తం అవకుండా కాలం గడుపుతుంది.

బహిరంగంగా ఎంత గంభీరంగా కనిపించినా వంచిత స్త్రీ నిజస్వరూపం ఆమె ఏకాంత వివిక్త శయ్యమీద బయటపడక మానదు. ఆశయ్యకు మాటలాడగల శక్తివుంటే ఆమె వ్యధా మోహ క్షుదిల దారుణ కఠోరగాథ పూసగుచ్చినట్టు విశ్వంలో చాటగలదు— కాని నారీ హృదయంలో ప్రతిధ్వనిస్తున్న ఆక్రందనం ఆమె ముఖ లక్షణాలను బట్టి బాహ్య ప్రపంచం తెలుసుకోలేదు. తెలుసుకోలేకపోగా ఊహించనుకూడా లేదు. అదే నారీ హృదయ వైచిత్ర్యం. పృథ్వీగర్భంలో ఎప్పుడూ తుకతుకలాడే శీతల జలంనుండి పచ్చిక బయళ్ళనుచూచిగాని గ్రహించలేదు.

తన హృదయం యింత జాగ్రత్తగా దాచగల శక్తి స్త్రీ జాతి సొత్తు. ఆడదాని నోటిలో నువ్వు గింజ నానదని అంటారుగాని అది యితరుల విషయానికి. యితరుల రహస్యాలకు చెందినంత వరకే. స్త్రీ తన రహస్యాలను దాచుకోవటంలో బహునేర్పరి, ఒకసారి ఆమె మనసులో యిది రహస్యం అని అనుకున్నదీ ఆమె ప్రాణం పోయినా చెప్పదు.

అయినా ఆమె— అసూయతో నాలుకలుచాచిన కాలానికి బలి అయిపోయింది.

అతను చేసిన పాపానికి ఆమెలో అంకురం మొలకెత్తింది.

కక్కొచ్చినా, కల్యాణమొచ్చినా ఆపలేం అనే సామెత యిలాటి అభాగినుల జీవితాలు చూసే వచ్చిందనుకుంటాను.

ప్రపంచంలో స్త్రీ దాచలేని రహస్యం ఏమిటంటే ఆమె గర్భాన్ని. ఎంతటి పవిత్రమైన పట్టువస్త్రం కట్టి దాచినా దాగని మచ్చ. మాయని ముద్ర.

ఆమె తల్లిదండ్రులు ఉగ్రరూపాలుదాల్చారు.

మానవజాతి గోరంతను కొండంతగా చేసి చూస్తుంది. ప్రతీ అల్ప విషయాన్ని గొప్ప బాధ్యతగా పరిగణించి ఆరాటపడుతుంది. ఇదే లోకం అనాది పాపం.

లోకానికి ఇతరుల రహస్యాలంటే అత్యంత ఆసక్తి అయినవి. తమ రహస్యాలలో వాళ్ళకి ఆసక్తి ఉండదు. వాటిలో వారికే కొత్తదనం కనిపించదు.



"మా అమ్మకు నేనంటే యిష్టం నువ్వంటే అసహ్యం"

తమ కుటుంబానికి తెచ్చిన కళంకానికి తల్లి దండ్రులు ఎలా సహించగలరు? లోకులు వేసే ప్రశ్నలకి ఎలా సమాధానం చెప్పగలరు?

ఆమెని బాధించారు. అతనెవరో చెప్ప మన్నారు.

ఏమని చెబుతుంది ఆమె ఎలా చెబుతుంది.

మౌనమే శరణ్యమైయింది ఆమెకి— తాను చేసిన తప్పే తమనోరు నొక్కేస్తుంది. తప్పు చేసిన వారికి లోకాన్ని ధిక్కరించ లేనివారికీ దబాయించ లేనివారికి మౌనమే శరణ్యం.

ఆమె ఎవ్వరికీ ముఖం చూపించలేకపోతుంది.

యిది తెలిసిన అతను ఎక్కడ ఆమె చెప్పేస్తుందో అని భయపడిపోయాడు. హాస్టలు ఖాళీ చేసి వెళ్ళిపోయాడు.

ఆమె ఈ సంగతి కనిపెట్టింది.

ఆమెలో ఉన్న ఆశకూడ నశించింది. రోజు రోజుకూ బ్రతుకు దుర్భరమయిపోతుంది. భారం అయిపోతుంది. తన బ్రతుకు తనకేకాదు తన తల్లీ దండ్రులకి తమ కుటుంబానికి భారం అయిపోయింది.

ఆమెకి దైవచింతన ఎక్కువయి పోయింది. దేవుడు తనకి అందం యిచ్చాడు కాని ఏం చేస్తాడు. తాను యిచ్చిన అందంతో తాను ప్రసాదించిన యౌవనంతోనే తనజీవితాన్ని బలి గొన్నారు. తన పడగవిప్పిన యౌవనంతోనే కాటు వేయించాడు.

అసలు తనకి యింత అందం ఎందుకు— యిలాటి యౌవనం ఎందుకివ్వాలి? మళ్ళీ వాటిని యిలా యింత ఘోరంగా ఎందుకు కలుషితంగా చెయ్యాలి.

నిరపరాధి అయిన బిడ్డను కఠినహృదయుడయిన తండ్రి నిర్హేతుకంగా కొట్టినప్పుడు ఎందుకో ఏమో తెలియక అభిమానం తెచ్చుకుని కుమిలిపోతూ ఎదురు చెప్పడానికి కూడా యిష్టం లేక బిడ్డ దిక్కుముఖంతో ఎలావుండిపోతాడో — అదే విధంగా ఆమె దైవం మీద కోపం తెచ్చుకుని కూర్చుంది.

దైవ ప్రేరితమని భావించి శిరసావహించిన ఆ హృదయం యిదేనా? ఈ అపవిత్రతకేనా? నారీబలిని కోరి, దైవం, బలి జీవాన్ని వంచించి యిక్కడికి తీసుకు వచ్చారా? మనసు లేని శరీరాన్ని, కేవలం మాంస పిండాన్ని నైవేద్యంగా సమర్పించ వలసిందేనా? ఆమెకి అవాళ దేవుడి మీద భక్తి ఉదయించటంలేదు. లోపల కోపం కసి, ప్రతీకారం ప్రబలిపోతున్నాయి. దేవుడి మీద ఆమెకి.

నేనింక నిన్నెలా సహించగలను? ఈ ముఖంతో నీకు అర్ఘ్యం ఎలా తీసుకురాను? నీ భక్తురాలిని నువ్వు స్వీకరించక దానివలె మత్స్య మాంసాదులవలె స్త్రీలను విక్రయించే సంతలో పూజోపహారంపొందాలని ఎవరికీ శ్రద్ధా భక్తులు లేని చోట, పుష్పితనాన్ని చేతులా మేకలను అప్పగించినట్టు నన్ను నా అందాన్ని. నా యౌవనాన్ని ఆ పశుప్రాయుడికి వేసావు. ఎవరు యిచ్చారు నీకు అధికారం? అసలు నన్ను ఎవరు పుట్టించ మన్నారు? నువ్వు ఎందుకు నన్నుయిలా హింసిస్తున్నావు? ఎందుకు బాధిస్తున్నావు? ఎందుకు శిక్షిస్తున్నావు? అంటూ దేవుని నానా మాటలూ అడిగింది.

ఆమెలో ఏదో చైత్రం కలిగింది.

అవును, నువ్వు బాధ పెట్టలేవు. శిక్షించలేవు. నేను అబలను అనుకుంటున్నావు కదూ? ఆ అబలత్వంతోనే నిన్ను జయిస్తాను. నన్ను కాపాడుకుంటాను అనుకుంది.

భారతస్త్రీగా పవిత్రతా భావాన్ని చెరుపుకోలేక పోతుంది. విధి చేస్తున్న వికృత పరీక్షలకి తట్టుకోలేకపోతుంది.

ఓ నాడు:

ఓ నాడు ఎవరూ లేని సమయం చూసింది. ఏ నుయ్యి అయితే తనకి ఈ పరిస్థితిని ప్రసాదించిందో దాని దగ్గరకే నడిచింది.

ప్రకృతి తనకు ప్రసాదించిన ప్రతిఫలాన్ని చూసి రెండు బాష్పాలని రాల్చింది.

తననే కాటు వేసిన తన యౌవన్నాని రూపు మాపదలచుకుంది.

నూతిలోకి తొంగిచూచింది తన నీడను. తాను ప్రసాదించిన అందంతోటే. యౌవనం తోటీ తనని బలిగొన్నాడు దేవుడు.

ఓ చిన్న రాయి విసిరి కదిపేసింది తన ప్రతి రూపాన్ని

తమ నుయ్యి ఎండి పోయినా ఈ నుయ్యి యింకా తరగలేదు. తనదాహాన్ని తీర్చడానికి.

అటూ యిటూ చూసింది. ఒక్కసారి నూతిలోకి గెంతి త్రాగింది నీరు.

దాహం తీరేదాకా.

యింకెప్పుడూ తనకు దాహం వెయ్యకుండా వుండేటంత వరకూ తాగింది నీరు.

* * *

ఆ తల్లి శవాన్ని మొట్టమొదట చూసింది ఎవరో తెలుసా బాబూ?

నా పాపిష్టి కళ్ళు

తల్లీ దండ్రీ అదో డిదో మన్నారు.

కాని ఎవ్వరూ జరిగిన క్షణాన్ని తిరిగి పొంద లేరు.

అతనికి— పారిపోయిన అతనికీ— తెలిసింది ఈ ఘోరం. అతనిమీద యితరులకీ అనుమానం కలిగినా ఎవ్వరూ ఏం చెయ్యలేకపోయారు. ఆధారాలు లేని నేరం. సాక్ష్యంలేని నేరానికి శిక్ష లేదు.

డాక్టరు— చచ్చాడంటే యింకే తిరుగులేదు.

అదీ మన భారతదేశం సాంఘిక న్యాయం.

కాని తరువాత బాధపడ్డాడు అతను— తాను చేసిన పనికి తన క్షణికోద్రేకానికి, క్షణిక సుఖం కోసం ప్రాణం అర్పించిన త్యాగమూర్తిని తలచి తలచి విలపించాడు. తన గాథను. ఈ గాథను చెప్పుకుని కన్నీరు నింపాడు.

ఊహలోనే ఏదో ఒక చిత్రమైన తీరువుంది. పాపాన్ని పసిగట్టడానికి పశ్చాత్తాపాన్ని పంపేది ఊహే. ప్రతి నేరం ఊహల తీగల పందిరి అల్లుకునేట్టు చేసేదికూడా ఊహే. వాస్తవ లోకంలో దుష్టులకు ఏన్నడూ శిక్షంటూ ఉండదు. మంచి వాళ్ళకి బహూకరణం వుండదు.

తను నిజం చెప్పినా, తన నేరాన్ని బయట పెట్టినా, తప్పుకున్న తనను శిక్షించలేదు లోకం. అయినా అతని హృదయం బ్రద్దలయి పోయింది. ఆమె చేసిన అత్యంత ఘనమైన ప్రాణ త్యాగానికి అతని మనస్సు అల్లాడిపోయింది.

తనకోసం, తన సుఖం కోసం— తన ప్రాణ రక్షణకోసం, తన పేరు పైకి చెప్పకుండా— మాన ప్రాణ త్యాగం చేసిన ఆమె హృదయ విశాలతకే తట్టుకోలేకపోయాడు.

మనసు వికలమై ఆఖరికి పిచ్చెత్తిపోయాడు.

\+ \+ \+

చావురానిదీ, యింకా బ్రతకాలనే వాంఛ తీరకముందే క్లిష్ట పరిస్థితుల్లో యిరుక్కుని దుర్భరజీవితం గడపలేక ఆత్మహత్య చేసుకున్న వాళ్ళు దెయ్యాలు అవుతారని అంటారు. అలాగే ఆమెకూడా దెయ్యం అయ్యిందనీ ఆ దెయ్యమే ఇక్కడ ఉందని అంటారు.

* * *

"అది బాబూ? ఆదెయ్యం వెనకాలఉన్నకథ" "అంటూ ముగించాడు ఆహూన్సేన్ తాత.

వేసవి కాలమైనా అతను కొంచెం వణుకు తున్నాడు.

కేవలం కథలామాత్రమే విన్న నేను నా శబ్ద రహితమైన రోదనలో వణికే పెదాలను అణుచుకోలేకపోయానుగాని ప్రత్యక్షంగా ఆ దృశ్యాన్ని చూసిన అతను వేడినెత్తురు చల్లారిన అతను ఆదృశ్యాన్ని తలచుకుని వణికాడంటే ఆశ్చర్యం లేదు.

ఆ తరవాత నేను నూతిదగ్గరనుంచి ఎలా రూమ్‌కి వెళ్ళానో, ఆ రాత్రి భోజనం చేశానో లేదో కూడా యిప్పటికయినా జ్ఞాపకం రావటం లేదు. — హున్సేనుచెప్పిన కథలాటి వాస్తవం తప్పిస్తే

అందుకే అన్నాను కథలు రాయటానికీ. కాలక్షేపానికీ ముసలాళ్ళు పనికి వస్తారనేది ఎంతయినా నిజం అని.

